క్లుప్తంగా

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

పొన్నలూరు: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, అందుకే ప్రతి ద్విచక్ర వాహనాదారుడు తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్సై అనుక్ కోరారు. పొన్నలూరులో శుక్రవారం రోడ్డు నిబంధనలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారుడు సురక్షితంగా ఇంటికి చేరాలంటే హెల్మెట్ ధరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటారన్నారు.ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు

నేడు మండల సర్వసభ్య సమావేశం

సింగరాయకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల, గ్రామస్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

మద్దిపూడి: మండలంలోని జంగాలపల్లి, మద్దిపూడి ఎస్సీ కాలనీలో జరుగుతున్న సిమెంట్ రోడ్, సైడ్ కాలువల నిర్మాణ పనులను స్థానిక ఎంపీడీఓ జగదీష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జంగాలపల్లిలో రూ.10 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన 160 మీటర్లు సీసీరోడ్ నిర్మాణ పనులు పరిశీలించారు. మద్దిపూడి దళితవాడలో రూ.15 లక్షల ఉపాధి హామీ నిధులతో 260 మీటర్లు దూరం సైడ్‌కాలువతో పాటు 55 మీటర్లు దూరం సిమెంట్ రోడ్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ జాలయ్య, ఇన్‌చార్జి ఇంజినీరింగ్ అసిస్టెంట్ అమృత ఉన్నారు.

మెప్మా బజార్ ప్రారంభం

కనిగిరిరూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్‌లు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో స్థానిక పీవీఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను శుక్రవారం ప్రారంభించారు. కమిషనర్ డానియల్ జోసఫ్ మాట్లాడుతూ మెప్మా బజార్‌లో ప్రతి నెల రెండు రోజుల పాటు పొదుపు మహిళలచే తయారు చేసిన ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. మెప్మా టీఎంసీ రఘు, మెప్మా సిబ్బంది, మున్సిపల్, సచివాయల సిబ్బంది, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఎస్‌కే ఫిరోజ్, రిజ్వాన్‌బాష పాల్గొన్నారు.

డిసెంబర్ 7న పేరెంట్స్.. టీచర్స్ మీటింగ్

పామూరు: మండలంలోని అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో డిసెంబర్ 07వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించి జయప్రదం చేయాలని మండల విద్యాశాఖాధికారి డి.వి.సుబ్బారావు తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ప్రాథకోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) పై సన్నాహక సమావేశం నిర్వహించారు.

పారిశుద్ధ్య చర్యల్లో వెనకడుగు వేయవద్దు

హనుమంతునిపాడు: కొనుగోలు చేసిన బ్లీచింగ్, సున్నం గ్రామాల్లో చల్లక పోవడంతో సచివాయాలోనే గుట్టలు గుట్టలుగా పడి ఉంది. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో ఇలా జరిగింది. దోమ పోటుతో రాత్రిపూట కంటిపై కునుకు పట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దుస్తుల పంపిణీ

కనిగిరిరూరల్: మండలంలోని ఎడవల్లి, కమ్మవారిపల్లి, యర్రోబనపల్లి గ్రామాల్లో ఎంపీటీసీ కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం మెంబర్ వట్టివేళ్ల రంగబాబు శుక్రవారం పలువురికి దుస్తులు, చీరలు, వగైరా వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పొన్నలూరు: కంది పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేష్ అన్నారు. మండలంలోని చెన్నిపాడులో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లరేగడి భూముల్లో కంది పంటను సాగు చేసిన రైతులు ఏపుగా పెరిగిన కంది పైరు చిగురు కొమ్మలను తుంచి వేయాలన్నారు. ఇలా చేయడంతో పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడులు పొందొచ్చన్నారు. రైతులకు 50 శాతం రాయితీతో 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందజేస్తామన్నారు. ముఖ్యంగా సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవడం ద్వారా రైతులు పంటల బీమా పొందొచ్చన్నారు. ఏవో పూర్ణచంద్రరావు, వ్యవసాయ సహాయకులు నాగమల్లేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గుంతలతో చింత


గుంతల మయంగా ఉన్న తూర్పు కట్టకిందపల్లె రోడ్డు


30వ మైలు వద్ద గుంతలమయంగా ఉన్న తూర్పు కట్టకిందపల్లె రోడ్డు


పామూరులోని సీఎస్‌పురం రోడ్డులో ఉన్న గుంతలు


మలుపువద్ద ప్రమాదకరంగా గుంతలతో ఉన్న తాగాయపల్లె రోడ్డు

- అధ్వానంగా పంచాయతీరాజ్ రోడ్లు
- కనీసం మరమ్మతుల గురించి పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పామూరు: మండలంలో పంచాయతీరాజ్ రోడ్లు గోతుల మయంగా మారి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మండల కేంద్రమైన పామూరు నుంచి సీఎస్‌పురానికి వెళ్లే రహదారి డబుల్ రోడ్డు. అయితే విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, డీవీ పాలెం వద్ద గుంతలమయంగా మారింది. మండలంలోని 30వ మైలు వద్ద నుంచి తూర్పు కట్టకిందపల్లె, కరోళ్లపాడు వెళ్లే పంచాయతీరాజ్‌కు చెందిన రోడ్డు కూడా గోతులతో నిండిపోయింది. ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఉదయం, సాయంత్రం విద్యార్థులతో వచ్చే పాఠశాలల వాహనాలతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పామూరు నుంచి తాతయపల్లె వెళ్లే పంచాయతీరాజ్‌కు చెందిన రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ రోడ్డు ద్వారా హైస్కూల్, జూనియర్, డిగ్రీ, బీఈడీ, డైట్ కళాశాలలకు బైక్, ఆటో, వ్యాన్‌లలో రాకపోకలు సాగిస్తుంటారు.


కొత్తపల్లె సమీపంలో గుంతలో ఉన్న హైవేకు వెళ్లే రోడ్డు

రోడ్డు గుంతలతో ఉండటంతో ప్రయాణం నరక యాతనగా మారుతోందని.. తాతాయపల్లె, పడమటిపల్లి, దూబగుంట్ల కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అదేవిధంగా తూర్పుకోడిగుడ్లపాడు రోడ్డుకూడా కొన్నిచోట్ల గుంతల మయంగా ఉంది. కాగా తాతాయపల్లె వెళ్లే రోడ్డు 167బి జాతీయ రహదారి బైపాస్‌కు కూడా పోయే మార్గం కావడంతో వాహనాల రద్దీ వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం రోడ్డు మరమ్మతులు చేసి కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లు గుంతల మయంగా ఉన్నా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6 మాసాలు దాటుతున్నా కనీసం మరమ్మతులు చేయడంలేదు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి:



గుంతల రోడ్డుతో ప్రజలు, వాహనదారులు, పొలాల్లోకి వెళ్లే పశుపోషకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి తాతాయపల్లె రోడ్డుకు మరమ్మతులు చేయించి వాహనదారుల, రైతుల, విద్యార్థుల కష్టాలు తీర్చాలి.

యం.జి.రాధాకృష్ణ, సర్పంచ్, బుక్కాపురం

నిధులు వచ్చిన వెంకటనే మరమ్మత్తులు చేస్తాం:

పంచాయతీ రాజ్ రోడ్లకు మరమ్మతుల నిమిత్తం నిధులు రాలేదు. నిధులు వచ్చిన వెంటనే పీఆర్ రోడ్ల మొత్తానికి మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

మస్తాన్‌వలి, పీఆర్, ఏఈ పామూరు


అధ్వానంగా ఉన్న తాతాయపల్లె రోడ్డు

ఆటోల్లో ప్రయాణికుల సర్కస్ ఫీట్లు


పాకల రోడ్డులో ఆటోలో సర్కస్ ఫీట్లు చేస్తున్న కూలీలు


రైల్వేరోడ్డులో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

సింగరాయకొండ: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తాం.. భారీగా జరిమానాగా విధిస్తామని పోలీసులు సోషల్ మీడియాలో ప్రకటనలు తప్ప ఆచరణలో అమలు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రతి నిత్యం మండల కేంద్రంలో, చుట్టుపక్కల గ్రామాల్లో ప్రయాణిస్తున్న విద్యార్థులు, కూలీలే నిదర్శనం. ప్రస్తుతం పాకల, సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ వరినాట్ల కోసం బాపట్ల జిల్లా ఈపూరుపాలెం తదితర ప్రాంతాల నుంచి కూలీలు వస్తున్నారు. ఆటోవాలాలు కూలీలను పొలాల వద్దకు చేరుస్తున్నారు. ఈ క్రమంలో కూలీలంతా ఒక్కసారిగా వెళ్లాలనే ఆతృతలో ఆటోలో ప్రాణాలకు తెగించి వేలాడుతూ వెళ్తున్నారు. దీనికి తోడు పాకల రోడ్డు గోతులమయంగా ఉండటంతో ఏ మాత్రం ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా ఉన్నా భారీ మూల్యం చెల్లించాల్సిందే. అంతేగాక ఉదయాన్నే పాఠశాలలకు విద్యార్థులు రావాలంటే గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలే దిక్కవుతున్నాయి. దీంతో విద్యార్థులు అందరూ కలిసి ఆటోలో వస్తుండటంతో ఒక్కోసారి ఆటోలో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆటో వెనకాల మీద డోర్ మీద కూర్చొని మరీ ప్రయాణిస్తూ పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి ఉంది. ఈ విధంగా రోజూ కూలీలు, విద్యార్థులు సర్కస్ ఫీట్లు చేస్తూ ప్రయాణించటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసులు సర్కస్ ఫీట్లను నిరోధిస్తారో లేక కొనసాగిస్తారో చూడాల్సి ఉంది.

ఘనంగా షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు షిరిడీ సాయిబాబా మందిరం 12వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు 108 కళశాలతో విశేష అభిషేకం, కాకడ హారతి, అష్టోత్తర కలశాభిషేకం, విఘ్నేశ్వర పూజ, సాయి కలశ ఆవాహన, లక్ష పుష్ప దర్శన, మధ్యాహ్న హారతి, మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ, సాయంత్రం సంధ్యా హారతి నిర్వహించి రాత్రికి విశేష పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సేవలకు నిలయంగా తీర్చిదిద్దాలి

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలను సేవలకు నిలయ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ బొలినేని సురేష్ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని చింతలపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీచేశారు. అనంతరం మండలంలోని పడమటి కట్టకిందపల్లెలో ఆధార్‌కేంద్రాన్ని తనిఖీచేసి సేవలపై వివరాలు తెలుసుకుని త్వరితగతిన ఆధార్ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. ఏపీఓ బి.మాల్యాద్రి, సిబ్బంది ఉన్నారు.

మద్యం అక్రమంగా అమ్మితే కఠిన చర్యలు

టంగుటూరు: మద్యం అక్రమంగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని అనంతవరంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న కసుకుర్తి అంజయ్యను శుక్రవారం అరెస్టు చేసి అతడి నుంచి ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారి సమాచారం తెలపాలని ఆయన ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండల పరిధి మహమ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు వెంకటలక్ష్మీ బాల బాలికలకు రక్త పరీక్షలు, దగ్గు, జలుబు, జ్వరం పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల పై సలహాలు చూచనలిచ్చారు.అనంతరం వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాలు పరిశుభ్రత పై విద్యార్థులకు సలహాలు ఇచ్చారు.

పౌష్టికాహారం అందించండి

కనిగిరిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 11వ వార్డు కాశిరెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం చైర్మన్ గఫార్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ దుర్గ, అంజయ్య, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆరోగ్యానికీ ప్రాధాన్యత ఇవ్వాలి

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు విద్యతోపాటు తమ ఆరోగ్యానికి కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గద్దే ఏడుకొండలు అన్నారు. మండలంలోని అరివేముల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు.అనంతరం దేశ్ కా ప్రకృతి పరీక్షాన్ అభియాన్ పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం గాలం సుప్రజ, అధ్యాపకులు భారతి, ఇండ్ల ప్రసాద్, ఎన్‌వీ నారాయణ పలువురు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

జరుగుమల్లి (సింగరాయకొండ): వరి, మిరప, మినుము వంటి పంట సాగులో తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం శిక్షణ సమన్వయకర్త రామ్మోహనరావు తెలిపారు. జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడు, కామేపల్లి గ్రామాల్లో శుక్రవారం రాష్ట్రీయ కృషి విజ్ఞాన కేంద్రం రాప్తార్ పథకం కింద జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణకు ముఖ్యంగా పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వరిలో పలు రకాల తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇ- క్రాప్ తప్పనిసరి

పీసీ పల్లి: మండలంలోని రబీ సీజన్ కింద మినుము, మిరప ,వరి, బత్తాయి, నిమ్మ ,దానిమ్మ పంటలు సాగు చేసిన రైతులు ప్రతి పంటకు సీఎస్సీ సెంటర్లలో ఇన్సూరెన్స్ కట్టుకొని, ఇ- క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రకాష్ రావు శుక్రవారం అన్నారు. వీరికి మాత్రమే బీమా వర్తిస్తుందని తెలిపారు.

వైభవంగా శత రుద్రాభిషేకం


విశిష్ట అలంకరణలో వళ్లీ, భుజంగేశ్వర స్వామి ఉత్సవమూర్తులు

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు మహంకాళి శివప్రసాద్ ఆధ్వర్యంలో రుత్వికులు వేద మంత్రాల నడుమ శత రుద్రాభిషేకం, రుద్ర హోమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మొదట వల్లీ అమ్మవారు, భుజంగేశ్వర మూల విగ్రహ మూర్తులకు విశేషపూజలు నిర్వహించారు. ఈఓ ఎస్‌జీఆర్.నరసింహబాబు, భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రావ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై బి. మహేంద్ర సూచించారు. స్థానిక శ్రీ విద్యానికేతన్‌లో శుక్రవారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలతో అనర్థాలు, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఎస్సై మహేంద్ర మాట్లాడుతూ ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో ఫేక్ అకౌంట్లతో జాగ్రత్త వహించాలని, ఎవరికీ ఓటీపీ చెప్పరాదని, పోలీసులమని చెప్పి మీపై కేసులు ఉన్నాయని బెదిరించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. మహిళలు, విద్యార్థినుల పట్ల జరిగే నేరాలపై అవగాహన ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, వాహనాల డాక్యుమెంట్లు సక్రమంగా ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో పెళ్లి ఆహ్వాన పత్రిక అంటూ వాట్సప్‌లో పంపుతున్నారని, ఈ ఫైల్‌ను ఓపెన్ చేశారంటే సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు అకౌంట్ ఖాళీ చేస్తారని హెచ్చరించారు. కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

పీసీపల్లి: మండలంలోని వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వేపగుంపల్లి గ్రామంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. డిసెంబర్ నెలలో గృహ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. వర్క్ ఇన్స్పెక్టర్ ఫిరోజ్ మాట్లాడుతూ పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలోనగదు జమ చేస్తామని తెలిపారు.

విత్తనశుద్ధి చేసి పంట విత్తుకోవాలి

కొండపి: విత్తనశుద్ధి చేసి పంటను విత్తు కోవాలని శాస్త్రవేత్త వెంకటేష్ అన్నారు. రాష్ట్రీయ కృషి విజ్ఞాన కేంద్రం రాప్తార్ పథకం ద్వారా ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు శాస్త్రవేత్తలు రైతులతో కలిసి మండలంలోని నేతివారిపాలెం, కట్టువారిపాలెం గ్రామాల్లో శుక్రవారం క్షేత్ర సందర్శన చేశారు. శాస్త్రవేత్త వెంకటేష్, జిల్లా వనరుల కేంద్రం శిక్షణ సమన్వయకర్త రామ్మోహన్రావు మాట్లాడుతూ మిరప పైరులో కింద ముడత, పైముడత వైరస్ తెగుళ్ల ఉన్నట్లు గమనించామని, వాటికి సంబంధించి నివారణ చర్యలు రైతులకు వివరించామన్నారు. శనగ పంటలు తెగులు వ్యాప్తి నివారణకు తప్పనిసరిగా వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. ఏఈఓ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్, వెంకటనారాయణ, రమ్య పాల్గొన్నారు జ

పశుగణన వేగవంతం చేయండి

హనుమంతునిపాడు: పశుగణన సర్వే ఈ వారంలో పూర్తి చేయాలని పశువైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాఘవయ్య, హనుమంతునిపాడు, వెలిగండ్ల మండాలకు చెందిన ఏడీఏ అరుణ అన్నారు. శుక్రవారం వేములపాడు పశు వైద్యశాలలో హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాలకు చెందిన పశు వైద్య శాఖ సహాయకులకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏడీఏ అరుణ, పశు వైద్యులు టి, రాజశేఖర్ రెడ్డి, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం


టంగుటూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో భారీ గుంత


కొండపి ఫ్లయి ఓవర్ కింద ఉన్న గుంత

టంగుటూరు: స్థానిక టోల్‌ప్లాజా, సింహపురి ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్, ఎన్‌హెచ్–16 అధికారులు టోల్‌ఫీజు వసూలులో చూపిస్తున్న శ్రద్ధ రోడ్డు మరమ్మతులపై చూపటం లేదు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కొండపి ఫ్లయి ఓవర్ కింద, సమీపంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, ఆర్టీసీ, పాఠశాల, కళాశాల బస్సులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా జాతీయ రహదారి అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నిత్యం టంగుటూరు నుంచి కొండపి వైపు వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నేషనల్ హైవే అధికారులు స్పందించి వేంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుకుంటున్నారు.

దద్దాల దాతృత్వం


కనిగిరి: రూ. 25వేలు ఇస్తున్న దద్దాల నారాయణ యాదవ్


కిష్టంపల్లిలో కుడారి నారాయణకు సాయం అందజేస్తున్న దద్దాల, పార్టీ నేతలు

- బాధితులకు రూ. 50 వేల అందజేత

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగ నగర్‌కు చెందిన పాస్టర్ రావూరి సిఫెన్, శాంతి కుమారుడు రావూరి మరియబాబు మెదడు సమస్యతో బాధ పడుతున్నాడు. దీంతో అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 25,000 ను వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం అందజేశారు. రావూరి మరియబాబు త్వరగా కోలుకోవాలని దద్దాల ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతి రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసుల రెడ్డి, భవనం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దాసరి మురళి, చింతం శ్రీనివాసులు, జి. ఆదినారాయణరెడ్డి, స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, సురేష్ బాబు, పాశం కొండయ్య, కస్తాల బాలాజి, ఉడుముల లక్ష్మీనారాయణరెడ్డి, చాంద్ బాషా, ముకరంజీ బాషా, మదార్‌వలి, నాని, ఈర్లశ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుడారి నారాయణకు..

హనుమంతునిపాడు: మండల పరిధి కిష్టంపల్లి ఎస్సీ పాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ పార్టీ కార్యకర్త కుడారి నారాయణకు దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం రూ. 20 వేలు అందజేశారు. నారాయణ ఇటీవలన రోడ్డు ప్రమాదంలో గాయ పడి ఆస్పత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి వచ్చారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ ఉడుముల వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షుడు దాసరిపల్లి సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, గాండ్ల పర్తి ఆదినారాయణరెడ్డి, కస్తాల బాలాజీ, ఏరువ వెంకట రెడ్డి, రుద్రపాటి రాజు, ఉడుముల లక్ష్మీ, నారాయణ రెడ్డి, తెలుకుట్ల సుబ్బారావు, నాగార్జున రెడ్డి, కోటపాటి మోహన్‌రెడ్డి, సర్పంచ్ సైకం ఏడుకొండల రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో శారీరక సామర్థ్యం

కొండపి: యోగా శారీరక సామర్థ్యాన్ని పెంచుతుందని స్థానిక సీఐ సోమశేఖర్ అన్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి యోగా కార్యక్రమాన్ని స్థానిక పోలీసుస్టేషన్లో శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శారీరిక మానసిక ఆరోగ్య రక్షణకు, ఒత్తిడి నివారణకు యోగా చాలా ఉపయోగకరమన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని, కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. క్రికెట్ మ్యాచ్లో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్ మ్యాచ్కి ముందు సిబ్బంది డ్రిల్లో పాల్గొన్నారు. ఎస్ఐ ప్రేమ్కుమార్, పొన్నలూరు ఎస్ఐ అనుక్, మద్దిపూడి ఎస్ఐ రమేష్‌బాబు, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.